క్లుప్తంగా

పలు సర్వేల తీరును పరిశీలించిన ఎంపీడీవో

సంతనూతలపాడు: పలు సర్వేల తీరును మండలంలోని మంగమూరు సచివాలయంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు బుధవారం పరిశీలించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు సంబంధించి పీఎంఏజీవై, పీజీఆర్ఎస్ సర్వేల పనితీరును పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్సై అజయ్ బాబు

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఎస్సై వేజెండ్ల అజయ్ బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. పోక్సో చట్టాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

300 మందికి అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం ఏర్పాటు చేస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా 44వ వారం సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో దేశవిదేశాల నుంచి దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక వైపు సేవలను, మరోవైపు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ చివుకుల రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రభుదాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. కంపెనీలో ఖాళీలు ఉన్నాయని, ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్‌మీడియట్ నుంచి పీజీ వరకు చదివిన 19 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ విజయవాడ, ప్రకాశం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ నగేష్, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ (9247433273, 9949914337)లను సంప్రదించాలని కోరారు.

క్రైస్తవులపై దాడులు పెరిగాయి



కొవ్వొత్తుల ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్ కృపానందం

దర్శి: రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు పెరిగాయని దర్శి గ్రేస్ రీజినల్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు గుంటూరు కృపానందం అన్నారు. జాతీయ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా దర్శి పట్టణంలో పాస్టర్లు బుధవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ కృపానందం మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వారిని హేళన చేస్తున్న పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ పగడాలది ప్రమాదకరమైన మృతి కాదని, ఇది ఎవరో చేసిన హత్య అని పలు క్రైస్తవ సంఘాలు ఆరోపిస్తున్నాయన్నారు. ఈ మృతిపై సీబీసీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రులు స్పందించి క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎన్.ఏసయ్య, మల్లెల యోహాను, పౌలు, గర్నెపూడి యోనాష్, దళిత నాయకులు గోవింద్ ప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉగాది సప్తాహ వేడుకలు

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి ఉగాది సప్తాహ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సూరే సత్యనారాయణ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి జరిగే పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మోసపూరిత కూటమి

- అన్నీ వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్నీ వర్గాల ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు విమర్శించారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి నిధులను కేటాయించకపోవడం విచారకరం అన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి తగినన్ని నిధులు కేటాయించకుండా మాయమాటలతో కాలం వెళ్లబుచ్చుతోందన్నారు. గత ప్రభుత్వం నగరంలోని 20,840 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిందని, అయితే తాము అధికారంలోకి వస్తే రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని నమ్మబలికి ఆచరణలో చర్యలు చేపట్ట లేదని విమర్శించారు. దశాబ్దాలుగా నగరంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నేతృత్వంలో ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు పది రోజుల పాటు ప్రజా చైతన్య యాత్ర చేపట్టి ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుందని తెలిపారు. నగర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతల, కొప్పోలులో ఏడేళ్ల క్రితం జీ ప్లస్ విధానంలో నిర్మాణం చేపట్టిన 428 టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. నగరంలోని వివిధ కాలనీల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. పోతురాజు కాలువ పరివాహక ప్రాంతాల్లోని కాలనీల్లో మురుగు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కాలువ అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించే వాహనాలను నిలిపి వేయడం దారుణమన్నారు. వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకొని రావాలని కోరారు. రిమ్స్ వైద్యశాలలో తాగునీటి సౌకర్యం, మౌలిక వసతులను మెరుగు పరచాలని, శివారు ప్రాంతాలకు మూడు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ నగరంతో పాటు శివారు కాలనీల్లో మందుబాబులు వీరంగం చేస్తున్నారని, వారి నుంచి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో తంబి శ్రీనివాసరావు, పి.కల్పన, జి.ఆదిలక్ష్మి, ఎస్డీ హుసేన్, దామా శ్రీనివాసులు, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మెళకువలు నేర్పాలి



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న సీడీపీఓ ఇవాంజలిన్

నాగులుప్పలపాడు: చిన్నారులకు మానసిక, శారీరక భాషా మేధాకు సంబంధించి మెళకువలు నేర్పాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఇవాంజలిన్ సూచించారు. నాగులుప్పలపాడులో అంగన్‌వాడీ కార్యకర్తలకు 3 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ శిక్షణలో దివ్యాంగుల పిల్లల పెంపకం, సంరక్షణ, అంగన్‌వాడీల ప్రొటోకాల్, స్క్రీనింగ్ షెడ్యూల్, తదితర అంశాల గురించి వివరించారు. 6 సంవత్సరాల్లోపు పిల్లలకు పోషణతో కూడిన ఆరోగ్య సంరక్షణతో పాటు ఆటపాటలతో విద్య నేర్పే విధానం గురించి వివరించారు. దివ్యాంగ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయండి

సంతనూతలపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఆయా కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఫణిరాజకుమారి కోరారు. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పలు సమస్యలు, అంశాలపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పి.అమూల్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.రమణ, ఎం.అనురాధ, కే ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలం చిలకపాడు హైస్కూల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు రిసోర్స్ పర్సన్లు అయిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.నాగలక్ష్మి, ఆర్.పిచ్చమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెమినార్‌కు ఏకేయూ విద్యార్థులు



అంతర్జాతీయ సెమినార్‌కు హాజరైన ఏకేయూ ఆక్వాకల్చర్ డిపార్టుమెంట్ విద్యార్థులు

ఒంగోలు సిటీ: నెల్లూరు నగర సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్శిటీలో డిపార్టుమెంటు ఆఫ్ మెరైన్ బయాలజీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌కు ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీకి చెందిన ఆక్వా కల్చర్ డిపార్టుమెంటు విద్యార్థులు హాజరయ్యారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి సూచనల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు తదితరుల సహాయ సహకారాలతో విద్యార్థులు ఈ సెమినార్‌కు హాజరై పలు పరిశోధక పత్రాలు సమర్పించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఆక్వా కల్చర్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ బి.సురేష్, డాక్టర్ అశ్వర్థ నారాయణ ఆధ్వర్యంలో ఆక్వా కల్చర్ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న పలువురు విద్యార్థులు ఈ అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై ఉపన్యాసకులు ఇచ్చిన ప్రసంగాలను, సుదీర్ఘ ఉపన్యాసాలను విని అనేక విషయాలు తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరపున అంతర్జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొనేందుకు విద్యార్థులకు సువర్ణావకాశం కల్పించిన వి.సి మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సెమినార్‌కు ఇతర దేశాలు, రాష్ట్రాలకు చెందిన అనేక మంది ప్రతినిధులు హాజరవగా, విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ప్రారంభోపన్యాసం చేశారు.

వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరించాలి

- జిల్లా వ్యవసాయాధికారి రమేష్‌బాబు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

కొత్తపట్నం: వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ కార్డు తరహాలో అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.రమేష్‌బాబు తెలిపారు. కొత్తపట్నం-2 రైతు సేవా కేంద్రంలో 11 అంకెల గుర్తింపు సంఖ్యపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను రైతులంతా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని అన్నారు. ఇప్పటికే మండలంలో 3,500 మంది రైతులచే రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏవో శ్రీనివాసరావు నాయక్, మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, ఏపీ ఏసీఎస్ఎఫ్ సిబ్బంది, మండల, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అచలానందస్వామి ఆరాధన



అచలానంద ఆశ్రమంలో అభిషేకంలో పాల్గొన్న పరిపూర్ణాసిద్ధానందస్వామి, భక్తులు



కోలాటం ప్రదర్శిస్తున్న ఆశ్రమ విద్యార్థులు

ఒంగోలు మెట్రో: పూజ గురువులు అచలానంద స్వామి తొమ్మిదో ఆరాధన మహోత్సవాలను బుధవారం ఒంగోలు మంగమూరుడొంకలోని ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, కాలజ్ఞానం, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, కాశీకాంబ సప్తశతి పారాయణములు, అచలానందస్వామికి, గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాల అభిషేకం, సహస్రనామార్చన, అచలానందస్వామి పాదుకలకు పరిపూర్ణాసిద్ధానందస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. సామూహికంగా పాల్గొన్న భక్తులచే భగవద్గీత లలితా సహస్రనామ పారాయణ, పూజ గురుదేవుల వారి జీవిత విశేషాలను ప్రవచనంగా భక్తులకు చక్కగా అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆశ్రమ విద్యార్థులచే కోలాట ప్రదర్శన నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకుల

చీమకుర్తి: పట్టణంలోని నక్కలవాగు ప్రాంతానికి చెందిన ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా నక్కలవాగు ప్రాంతంలో సీపీఎం నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, తొట్టెంపూడి రామారావు, తదితరులు పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యతో పాటు రోడ్లు లేక వర్షాకాలంలో కలిగే సమస్యలను నాయకుల దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. అనంతరం చీమకుర్తి మున్సిపాలిటీలోని 1వ వార్డు పాటిమీదపాలెంలో నాయకులు పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజలు తెలియజేసిన సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సాగర్‌నీటిని అందించేందుకు పైపులైన్‌లు నిర్మించాలని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా, బోర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా అన్నమయ్య ఆరాధనోత్సవం

- అలరించిన అన్నమయ్య సంకీర్తనా విభావరి
- అభినవ అన్నమాచార్యులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాదుకు నివాళి



అన్నమయ్యకు పూజా క్రతువులు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 522వ వర్ధంతి సభను తాళ్లపాక అన్నమాచార్య సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలోని అన్నమయ్య విగ్రహ సన్నిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఐ.మురళీకృష్ణ మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరుడిని 32 వేల సంకీర్తనలతో సేవించి తరించిన పరమభాగవత శిఖామణి అన్నమయ్య అని తెలిపారు. 600 అన్నమయ్య కీర్తనలను స్వర కల్పన చేసి అన్నమయ్య మానస పుత్రుడైన అభినవ అన్నమాచార్యులు, ఇటీవల మృతిచెందిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంగీత సాహిత్య సేవలను కొనియాడారు. ఆయన గాత్రం అజరామరమని కీర్తించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ, అన్నమయ్య విరచిత సంకీర్తనలు లలితసుమధురమై, తెలుగు సాహితీ రంగాన స్థిరమై నిలిచాయన్నారు. గరిమెళ్ల మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని అన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు మాట్లాడుతూ అన్నమయ్య గొప్ప సామాజిక దార్శనికుడని అన్నారు. దేవస్థాన అర్చకుడు సుధాకర్‌స్వామి ఆధ్వర్యంలో విశేష పూజా క్రతువులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా జరిగిన సంగీత విభావరిలో గాయకులు మా మూర్తి, గుర్రం కృష్ణ, బదరీ రంగనాథ్, ఆకుల శ్రీను, ఈదుల చిన్నికృష్ణ, వేంకట సుబ్బయ్య తదితరులు ఆలపించిన కీర్తనలు అలరించాయి. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డాక్టర్ ఆర్.ప్రసాదరావు, డి.ప్రసన్న కుమారి, పి.జానకిరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షేడ్ నెట్ సాగులో హైబ్రిడ్ విత్తనాలే కీలకం

- సీనియర్ శాస్త్రవేత్త రవీంద్రబాబు



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఒంగోలు వన్‌టౌన్: షేడ్ నెట్ కింద కూరగాయల సాగు, పూల పెంపకంలో సరైన హైబ్రిడ్ విత్తనాలు ఎంపిక చేసుకోవాలని దర్శి ఉద్యాన పరిశోధన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు పేర్కొన్నారు. షేడ్ నెట్ కింద మిరప, దానిమ్మ, కూరగాయలు, పూల పెంపకంపై బుధవారం ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో ఉద్యానశాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తన శుద్ధి చేస్తే రసం పీల్చే పురుగుల దాడిని తట్టుకుంటాయన్నారు. వేప సంబంధిత పురుగు మందులను మాత్రమే వాడాలన్నారు. విచక్షణా రహితంగా రసాయన పురుగు మందులు వినియోగించవద్దని చెప్పారు. సీజన్‌కు అనుకూలమైన కూరగాయలు, పూలను సాగు చేసి లాభాలు పొందాలని సూచించారు.

కందుకూరు హార్టికల్చర్ అసోసియేట్ డీన్ డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ.. మిరప, దానిమ్మ పంటలను ఆశించే రసం పీల్చే పురుగులు, బ్యాక్టీరియా ఆకు మచ్చ, సెర్కోస్పోరా ఆకుమచ్చ, కాయ తొలిచే పురుగుల నివారణకు సమగ్ర సస్య రక్షణ పద్ధతులను వివరించారు. కాయ నాణ్యతను దెబ్బతీసే త్రిప్స్, మంగు నల్లి నుంచి పంటలను రక్షించుకోవాలని సూచించారు. కందుకూరుకు చెందిన హార్టికల్చర్ శాస్త్రవేత్త వెంకట రమణ మాట్లాడుతూ.. టమోటా లాంటి కూరగాయలను వేసవిలో కోతకు వచ్చేలా సాగు చేయాలని, తీగ జాతి కూరగాయలను శాశ్వత పందిర్ల కింద సాగు చేసుకోవాలని చెప్పారు. ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ మాట్లాడుతూ.. రైతులు డ్రిప్ పద్ధతిలో నీరందిస్తూ, నీటిలో కరిగే రసాయనిక ఎరువులు వాడాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పలు రకాల రాయితీల గురించి జిల్లా ఉద్యాన శాఖాధికారి వై.గోపీచంద్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, డీఆర్‌డీఏ ఏపీఎంలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై నేడు విచారణ

కురిచేడు: మండలంలోని పడమరనాయుడుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కరిముల్లాపై గురువారం డిప్యూటీ డీఈఓ విచారణ చేపట్టనున్నారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు రావడంతో జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఈ సంఘటనపై విచారణ జరపాలని జిల్లా విద్యాశాఖ నుంచి మండల విద్యాశాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సదరు ఉపాధ్యాయుడిని కాపాడేందుకు మండల విద్యాశాఖ అధికారులు వారం రోజులుగా నానాప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి నాయకులతో మంతనాలు జరిపి ఎలాగైనా విచారణలో వాస్తవాలు బయటకు రాకుండా చేసి ఉపాధ్యాయుడిని కాపాడటమే లక్ష్యంగా మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం ఊపందుకుంది. విద్యాశాఖకు అప్రతిష్ట వస్తుందనే నెపంతో ఉన్నతాధికారులు కూడా మొక్కుబడిగా విచారణ జరపనున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు బహిరంగంగా పేర్కొంటున్నాయి. ఎంఈఓలపై వచ్చిన ఆరోపణలపై జరిగిన విచారణ లాగానే ఉపాధ్యాయుడిపై కూడా విచారణ జరుగుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముందస్తుగా విచారణాధికారికి సన్మానం చేసేందుకు కూడా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసిన గ్రామస్తులు నిజాయితీగా విచారణలో వాస్తవాలు వెల్లడిస్తారా.? లేకుంటే కూటమి నాయకులు, అధికారులు చేసిన ప్రయత్నాలకు తలొగ్గి విషయాన్ని దాస్తారా..? కీచక గురువుపై చర్యలు తీసుకుంటారా..? అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.



ఉపాధ్యాయుడిపై ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, గ్రామస్తులు (ఫైల్)

అరవింద్ వైద్యశాలలో ఆధునిక వైద్యం



డాక్టర్ నరేంద్ర, భానుతేజలకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: నగరంలో గత రెండు సంవత్సరాలుగా జీర్ణకోశ, శ్వాసకోశ వ్యాధులకు అత్యంత ఆధునిక వైద్యం అందిస్తున్నట్లు అరవింద్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్వాహకుడు డాక్టర్ నరేంద్ర తెలిపారు. బుధవారం నగరంలోని అరవింద్ వైద్యశాలలో ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల వయసు కలిగిన పసిపిల్లల నుంచి వందలాది మంది చిన్నారులకు, పెద్దవారికి జీర్ణకోశ, శ్వాసకోశంలో చిక్కుకుపోయిన ఫారిన్ బాడీలను సురక్షితంగా వెలికి తీసినట్లు తెలిపారు. అరుదైన వ్యాధులకు నగరాలకు మాత్రమే పరిమితమైన శస్త్ర చికిత్సలను ఒంగోలులో మొట్టమొదటిగా నిర్వహించినట్లు చెప్పారు. శ్వాసకోశ వైద్య నిపుణురాలు డాక్టర్ భానుతేజ మాట్లాడుతూ క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్లను బ్రాంకోస్కోపీ ద్వారా నిర్ధారణ చేస్తున్నట్లు తెలిపారు. దాంతో కచ్చితత్వంతో చికిత్స చేయడానికి వీలుంటుందన్నారు. అనంతరం వైద్యశాల నిర్వాహకులకు నగరానికి చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.